క్లుప్తంగా

18న పాపమాంబ ఆరాధనోత్సవం


పాపమాంబ అవ్వ జీవసమాధి

ఆదోని అర్బన్: పట్టణంలోని మరాఠీవీధిలో వెలిసిన శ్రీ పాపమ్మ మఠంలో శ్రీ పాపమాంబ 67వ ఆరాధన ఉత్సవాలు శనివారం నిర్వహిస్తున్నట్లు మఠం నిర్వాహకులు మాస్కర్ రమేష్ తెలిపారు. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం, పూజా అర్చన ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రథోత్సవం ఉంటుందని చెప్పారు. మఠం నుంచి రథం బయలుదేరి వాసవీ కల్యాణ మండపం వరకు వెళ్లి తిరిగి చేరుతుందని తెలిపారు.

జగనన్న కాలనీలో అధికారుల పర్యటన


జగనన్న కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, హౌసింగ్ బోర్డు డీఈ రవికుమార్

ఆదోని టౌన్ : హౌసింగ్ డీఈ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి బుధవారం పట్టమలోని జగనన్న కాలనీ సందర్శించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. నిర్మాణం పనులను నాణ్యతగా చేపడుతూ పనులను వేగవంతం చేయాలని థర్డ్ పార్టీ కాంట్రాక్టర్‌కు సూచించారు. లబ్ధిదారులకు అనుగుణంగా సిమెంట్, స్టీల్, ఇసుక, నీటి వసతిని సమకూర్చామన్నారు. లబ్ధిదారులు ఎంతమంది ముందుకొచ్చినా ఇళ్ల నిర్మాణం పనులు చేపట్టేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : మండలంలోని పాండవగల్లు గ్రామంలో సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు కె.లింగన్న ప్రారంభించారు. విజేతలకు మొదటి బహుమతి రూ.25 వేలు (దాత పాండవగల్లు గ్రామ 7వ వార్డు సభ్యుడు క్రిష్ణ), రెండో బహుమతి రూ.15 వేలు (ఆదోని ఎక్కి పంప్స్ డీలర్ ఎస్.శ్రీకాంత్) చేతులమీదుగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ మాజీ చైర్మన్ రామాంజనేయులు, పదో వార్డు మెంబర్ హుసేని, కుప్పగల్, పాండవగల్ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని వి.తిమ్మాపురం గ్రామంలో ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళ రక్షణ కోసం దిశ చట్టం అమలులో ఉందని, ప్రతి మహిళ దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కర్ణాటక మద్యం విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పాము కాటుతో వలస కూలీ మృతి


రామయ్య(ఫైల్)

కౌతాళం: పనుల కోసం గుంటూరుకు వలస వెళ్లి పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గౌతులదొడ్డి గ్రామానికి చెందిన దిబ్బయ్యగారి రామ య్య (42) గ్రామంలో పొలం పనులు లేకపోవడంతో గుంటూరు పరిసరాలలోని బండారు పల్లెకు మిరప పంట కోతకు భార్య రామలింగమ్మతో కలిసి వలస వెళ్లాడు. మంగళవారం మిరప పంటను కోస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. గమనించిన తోటి కూలీలు చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతదేహం బుధవారం సాయంత్రం మృతుని స్వగ్రామం గౌతులదొడ్డికి చేరడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

శనగ కొనుగోళ్లు నిలిపివేత

ఆలూరు రూరల్: రాష్ట్రంలో వర్ష సూచన ఉన్నందున ఈ నెల 20వ తేదీ వరకు మండలంలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న శనగ కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ ప్రకాష్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి బిల్లింగ్ వేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ తర్వాత యథావిధిగా కొనుగోళ్లు చేపడతామని, రైతులు గమనించాలని కోరారు.

యంత్ర సేవ.. రైతుకు తోవ

- అన్నదాతకు బాసటగా వైఎస్సార్ యంత్ర సేవా పథకం
- నియోజకవర్గంలో 356 మందికి యంత్ర సాయం
- రూ.7.12 కోట్లకు గానూ రూ.2.63 కోట్ల రాయితీ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు


రైతు గ్రూపులకు ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి (ఫైల్)

మండలం	ఆర్‌బీకేలు	సీహెచ్‌సీ	లబ్ధిదారులు గ్రూపులు	యూనిట్ ధర (రూపాయల్లో)	రాయితీ (రూపాయల్లో)
మంత్రాలయం	20	18	91	1,71,67,697	61,83,227
పెద్దకడబూరు	18	15	90	2,28,06,691	83,45,309
కోసిగి	17	16	80	1,39,25,089	54,54,990
కౌతాళం	23	19	95	1,73,58,618	63,21,565
మొత్తం	78	68	356	7,12,58,095	2,63,05,091

మంత్రాలయం: వైఎస్సార్ యంత్రసేవ పథకం సన్న, చిన్న కారు రైతులకు వరంగా మారింది. వ్యవసాయ యాంత్రీకరణ వైపు అన్నదాత అడుగులు వేస్తున్నాడు. ఇందుకు చేయూతగా ప్రభుత్వం విప్లవాత్మకంగా కస్టమ్ హయరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ)కు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు మంజూరు చేస్తోంది. రైతులు సంఘటితంగా అద్దె ప్రాతిపదికన యంత్ర సేవలు పొందవచ్చు. రైతన్నల సాగు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

40 శాతం సబ్సిడీ

నియోజకవర్గంలో ఆర్బీకేలకు అనుసంధానంగా కస్టమ్ హయరింగ్ సెంటర్లను వ్యవసాయాధికారులు ఏర్పాటు చేశారు. యంత్ర సేవ పథకం ద్వారా సీహెచ్‌సీ గ్రూపులు రూ.15 లక్షలు వరకు యంత్ర పరికరాలు కొనుగోలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.6 లక్షలు సబ్సిడీని అందిస్తుంది. గ్రూపు కమిటీ యూనిట్ ధర రూ.15 లక్షలు కాగా ప్రభుత్వం 40 శాతం సబ్సిడీని అందిస్తూ 50 శాతం రుణం మంజూరు చేస్తుంది. రైతు గ్రూపులు కేవలం 10 శాతం మాత్రమే తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుంది.

యంత్రసేవ పథకం ద్వారా అందించే యంత్రాలు

వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద అన్ని రకాల యంత్రాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. రైతులకు వ్యవసాయానికి అవసరమైన పనిముట్ల రైతులే ఎంపిక చేసుకునే విధంగా వెసులుబాటును కల్పించింది. కస్టమ్ హేరింగ్ సెంటర్లలో విత్తనం నుంచి పంట కోత కోసేందుకు ఉపయోగపడే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. విత్తనం గొర్రులు, లోతు దుక్కిలు దున్నే ఇనుప నాగళ్లు, పవర్ టిల్లర్, అంతర్ సేద్యం చేసే గొర్రు, గుంటక, కల్టివేటర్, థైవాన్ స్ప్రేయర్ పంపులు ఇలా రైతులకు అవసరమైన అన్ని రకాల యంత్రపరికరాలు అందుబాటులో ఉంటాయి. సాగుకు అవసరమైన అన్ని పనులకు యంత్రాలను రైతు కమిటీలకు ప్రభుత్వం అందిస్తుంది.

రూ.7.12 కోట్ల యంత్రాలు పంపిణీ

మంత్రాలయం నియోజకవర్గంలో వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా 68 సీహెచ్‌సీ గ్రూపులు లబ్ధిపొందాయి. అందులో 356 రైతులకు వివిధ రకాల పనిముట్లు, యంత్రాలు పంపిణీ చేశారు. అందుకు గానూ ప్రభుత్వం రూ. 7,12,58,095 విలువజేసే యంత్రాలు మంజూరు చేసింది. అందుకు గానూ ప్రభుత్వం 40 శాతంగా రూ.2,63,05,091 రాయితీ రైతులకు అందజేసింది. 60 శాతం నగదుతో ఇలాంటి విలువైన యంత్రాలు రైతులకు మంజూరు చేస్తుండటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరులో 90, మంత్రాలయంలో 91, కోసిగిలో 80, కౌతాళంలో 95 మంది రైతు గ్రూపులు లబ్ధిపొందాయి. ఒక్కో ట్రాక్టర్‌కు సబ్సిడీ రూ.2,98,280, ఒక థైవాన్ స్ప్రేయర్ రూ.8 వేలు, కాటన్ సీడర్ రూ.54 వేలు, రూటర్‌వేటర్ రూ. 35 వేల చొప్పున ప్రభుత్వం సబ్సిడీని రైతు గ్రూపు ఖాతాల్లో జమ చేస్తుంది.

రైతులకు ఎంతో మేలు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన యంత్రసేవ పథకం రైతులకు ఎంతో మేలు. సీహెచ్‌సీ గ్రూపు ఏ ర్పాటు చేసుకున్నాం. మా గ్రూపు ద్వారా ట్రాక్టర్‌తో పాటు సేద్యపు పనిముట్లు తీసుకున్నాం. ట్రాక్టర్‌కు రూ.2,98,280 ఇవ్వగా, ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.3,38,280 సబ్సిడీ సొమ్ము మా గ్రూపు ఖాతాలో జమ చేసింది. మాకు చాలా సంతోషంగా ఉంది. సాగుకు యంత్ర సేవ పథకం దోహదపడుతోంది.

– వీరేష్, రైతు, కౌతాళం

సద్వినియోగం చేసుకోవాలి



రైతులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ యంత్రసేవ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మండలంలో 20 రైతు గ్రూపులను తయారు చేశాం. ఇప్పటి వరకు 18 గ్రూపులు ప్రభుత్వం అందించే యంత్ర పరికరాలను వినియోగించుకున్నాయి. మిగిలిన గ్రూపులు కూడా అవగాహన కల్పిస్తున్నాం. త్వరలో మిగిలిన గ్రూపులకు యంత్ర పరికరాలను పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నాం.

– జీరా గణేష్, వ్యవసాయాధికారి, మంత్రాలయం

వ్యక్తి హత్యపై విచారణ

తుగ్గలి : పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో మంగళవారం రాత్రి జరిగిన గుర్తు తెలియని వ్యక్తి హత్యపై తుగ్గలి పోలీసులు విచారణ వేగవంతం చేశారు. బుధవారం ఎస్‌ఐ మల్లికార్జున తన సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. హత్యకు గురైన వ్యక్తికి 42 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. హత్యకు ముందు ఉదయం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో దుస్తులు సరిగా లేక సంచరించినట్లు సీసీ ఫుటేజ్, గ్రామస్తులు ద్వారా తెలుసుకున్నారు. దీన్ని బట్టి హతుడు మానసిక స్థితి బాగా లేదని తెలుస్తోంది. అయితే మానసికస్థితి బాగా లేని వ్యక్తిని చంపాల్సిన అవసరం ఎవరికి, ఎందుకు అవసరం ఉందనేది చర్చనీయాంశమైంది. ఏ ప్రాంతం నుంచి ఇక్కడి వచ్చాడు అనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. ఎలాంటి ఆనవాళ్లు లభించక పోవడంతో హత్య కేసును ఛేదించేందుకు వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు.

ప్రత్యేక పూజలు

ఆలూరు: దేవనకొండ మండలంలో కొలువుదీరిన శ్రీ గద్దెరాళ్ల మారెమ్మకు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున తదితరులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఆహ్వానం పలికారు. కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ ఉమాంబ, లక్ష్మన్న, వీరేష్ పాల్గొన్నారు.

ఘనంగా మారికాంబిక దేవర

హొళగుంద: మండలంలోని ఇంగళదహాళ్ గ్రామంలో వెలిసిన మారికాంబిక దేవరలో భాగంగా బుధవారం కుంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం గంగపూజ నిర్వహించిన గ్రామస్తులు అక్కడి నుంచి కుంభాన్ని ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయంలో అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పించారు.

క్షయవ్యాధిపై అవగాహన ఉండాలి


క్షయవ్యాధిపై ర్యాలీ చేపడుతున్న దృశ్యం

పెద్దకడబూరు: క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని క్షయవ్యాధి నిపుణులు షేకున్ బాను, బాబురాజు అన్నారు. మండల పరిధిలోని పెద్దకడబూరు, దొడ్డిమేకల, రాగిమాన్‌దొడ్డి, గంగులపాడు, హెచ్.మురవణి గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో బుధవారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకడబూరులో క్షయవ్యాధిపై ర్యాలీ చేపట్టారు. క్షయవ్యాధి లక్షణాల గురించి అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండడం, దగ్గులో రక్తం చారలు పడడం, ఆకలి మందగించడం,బరువు తగ్గిపోవడం,ఉదయం,సాయంత్రం జ్వరం రావడం వంటి లక్షణాలుంటే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నిర్ధారణ అయితే వారికి 6నెలల పాటు మాత్రలను ఉచితంగా ఇవ్వడమే కాక మంచి ఆహారం తీసుకోవడం కోసం నెలకు రూ. 500లు పారితోషికం ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది స్వరూప్, ఏఎన్ఎం లోకేశ్వరి, యల్లన్న, ఆశాలు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణంపై వాగ్వాదం

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని రామచంద్రనగర్‌లో కొన్ని సంవత్సరాలుగా సీఎస్ఐ చర్చి ఉంది. అయితే ఇటీవల చర్చి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. మంత్రాలయంలో చర్చి నిర్మాణ పనులు చేపట్టకూడదని ఆదోనికి చెందిన కర్ణ, నరసింహులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఏడాది నుంచి చర్చి నిర్మాణ పనులు నిలిపివేశారు. అయితే బుధవారం కర్ణ, నరసింహులు చర్చి నిర్మాణ పనులను పరిశీలించేందుకు మంత్రాలయం వచ్చారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌తో కలిసి చర్చి నిర్మాణ స్థలం వద్దకు చేరుకుని ఫోటోలు తీసుకుంటున్న సమయంలో కాలనీవాసులు అక్కడికి చేరుకున్నారు. ఇక్కడ కొత్తగా చర్చి కట్టడం లేదని, గత కొన్ని సంవత్సరాలుగా చర్చి ఉందని దానిని పునర్నిర్మిస్తే ఇబ్బందని ఏమిటని కర్ణ, నరసింహులును ప్రశ్నించారు. వారు అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం చేరుకోగా, కొంత మంది అక్కడి వెళ్లి మాట్లాడే ప్రయత్నంతో చేయడంతో కొంత సేపు వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని కాలనీవాసులకు ఎదైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని, గొడవలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించి అక్కడి నుంచి పంపేశారు. అనంతరం నిర్మాణానికి సంబంధించిన పలు రికార్డు, పత్రాలను గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దులు ఏర్పాటు చేయండి


బనవాసిలో సర్వే పూర్తయిన పొలంలో హద్దులు వేయిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: వైఎస్సార్ – జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని పొలాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. బుధవారం మధ్యాహ్నం మండలంలోని బనవాసి గ్రామంలో రీసర్వే పూర్తయిన పొలాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూ రక్ష రీసర్వే ఇప్పటి వరకు 58 గ్రామాల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. పూర్తి చేసిన గ్రామాల్లో రైతులకు తమ పొలంలో హద్దుల ఏర్పాటును యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. రీసర్వేలో ఏవేనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీసర్వేతో భూ రికార్డులు, హద్దులకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు వేణుసూర్య, శ్రీనివాసులు, మండల సర్వేయర్లు అశోక్, రమణ, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

హొళగుంద: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు వస్తాయని చిన్నహ్యాట వీఏఏ తస్లీ మా అన్నారు. బుధవారం చిన్నహ్యాట గ్రామ పరిధిలోని శేఖరప్ప అనే రైతుకు చెందిన వేరుశనగ పంట పొలంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కషాయాలు తయారు చేసుకోవడంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ పద్ధతిలో పంటలు సాగు చేస్తే నాణ్యమైన దిగుబడులు అధికంగా వస్తాయని, మార్కెట్‌లో ఈ ఉత్పత్తులకు డిమాండ్ ఉంటంతో రైతులకు అధిక లభిస్తుందని చెప్పారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం

- గంట ముందే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్న విద్యార్థులు
- పట్టణంలో 8 కేంద్రాల్లో పరీక్షలు
- 3,200 మంది విద్యార్థులు హాజరు
- మాస్ కాపీయింగ్ జరగకుండా పోలీసు బందోబస్తు


ఆదోనిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు


పరీక్ష రాసేందుకు పరుగు తీస్తున్న విద్యార్థులు

ఆదోని అర్బన్: పట్టణంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 8 కేంద్రాల్లో నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షల్లో 3,200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎలాంటి కాపీయింగ్, మాస్ కాపీయింగ్ జరగకుండా డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో త్రీటౌన్ సీఐ శ్రీరాములు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్ద వేచి ఉండి కేంద్రాల్లో ఏ గదిలో నంబర్ ఉందో బోర్డులో చూసుకున్నారు. 8 గంటలకు విద్యార్థులను ఆయా కళాశాల యాజమాన్యం గదిలోకి అనుమతించారు. కేంద్రాల్లో నీరు, వైద్యాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రెండు కేంద్రాలు, బాలాజీ–01, జ్యోతిర్మయి–01, విశ్వనారాయణ–01, నారాయణ–01, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల–01 మొత్తం 8 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి.

ఇంటర్ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో భాగంగా తెలుగు పరీక్షకు 225 మంది విద్యార్థులకు గాను 223 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ స్వామి తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కౌతాళం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షలకు 366 మంది విద్యార్థులకు గాను 318 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. మొదటి రోజు పరీక్షలను ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు ఎల్లన్న, రాజేశ్వరి తనిఖీ చేశారు. విద్యార్థులు అసౌకర్యాలకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

పరీక్షల వేళ ఆరోగ్యం జాగ్రత్త

కృష్ణగిరి: ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు, రాబోవు పదో తరగతి పరీక్షల నేపథ్యంలో వసతి గృహాలు, సంక్షేమ పాఠశాలల అధికారులు బాలికల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జీసీడీఓ సునీత తెలిపారు. బుధవారం స్థానిక కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసి బాలికలతో మాట్లాడారు. వారికి అందించిన భోజనాన్ని పరిశీలించి, పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విధానాన్ని తెలుసు కుని సంతృప్తి వ్యక్తం చేశారు.

29 నుంచి కబడ్డీ పోటీలు

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 29, 30 తేదీల్లో కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు కె.కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనదలచిన జట్లు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలని పేర్కొన్నారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ.6వేలు, రూ.4 వేలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 99896 42989 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నిర్దేశిత రుణ లక్ష్యాన్ని పూర్తి చేయాలి


మాట్లాడుతున్న వెంకటనారాయణ

ఆలూరు రూరల్: ఈ ఏడాది ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రుణ లక్ష్యాలను ఏడాది లోపు పూర్తి చేయాలని కర్నూలు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఆలూరు నియోజకవర్గంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. ఆయా బ్యాంకుల పరిధిలో రైతులకు క్రాప్ లోన్, డ్వాక్రా సంఘాల రుణాలు, వివిధ రంగాల అనుబంధ సేవల రుణాలను సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. 2023 ఆర్థిక సంవత్సరానికి రూ.4,394.47 కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.4,048.49 కోట్ల రుణాలను మంజూరు చేశారన్నారు. అలాగే పంట రుణాల కోసం రూ. 106.39 కోట్లకు గాను రూ.38.39 కోట్లు అందించినట్లు చెప్పారు. వివిధ రకాల అనుబంధ రంగాలకు అందించే రుణాలు రూ.179.38 కోట్లకు గాను రూ.187.82 కోట్లు మంజూరు చేయగా.. సూక్ష్మ,చిన్న మధ్యతరహా పరిశ్రమలకు రూ.1308.20 కోట్లు టార్గెట్ ఇవ్వగా రూ.1425.51 కోట్ల రుణాలు అందజేశామని చెప్పారు. మిగిలిన రుణ లక్ష్యాలను అర్హులైన వారికి అందించి పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ కన్వీనర్ నెహామతుల్లా, జిల్లా చీఫ్ మేనేజర్ ఆర్ శెట్టి, అన్ని బ్యాంకుల మేనేజర్లు, డీఆర్‌డీఏ, వైకేపీ అధికారులు హాజరయ్యారు.

హుండీ కానుకల లెక్కింపు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలోనున్న వీరభద్రస్వామి ఆలయంలో ఈఓ రాంప్రసాద్ సమక్షంలో గ్రామస్తులు బుధవారం హుండీ కానులకను లెక్కించారు. లెక్కింపులో రూ.3,34,810 ఆదాయం లభించిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన


జాబితను ప్రదర్శిస్తున్న వ్యవసాయాధికారి శేషాద్రి

కౌతాళం: మండలంలోని రైతులు రబీ సీజన్‌లో సాగుచేసి నమోదు చేసుకున్న పంటల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. మండల పరిధిలోని హాల్వి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు రబీ సీజన్‌లో సాగుచేసిన వరి, సజ్జ, జొన్న, కొర్ర తదితర పంటల వివరాలను ఆయా గ్రామాల ఆర్బీకేల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో ఉంచినట్లు తెలిపారు. వాటిని రైతులు సరిచూసుకొని ఏవైనా తప్పులుంటే ఈనెల 17వ తేదిలోపు సరిదిద్దుకోవాలని సూచించారు.

పంటనమోదు జాబితాను సరిచూసుకోండి

పెద్దకడబూరు : రైతులు పంట నమోదు జాబితాను సరిచూసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో బుధవారం పంటనమోదుపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో రైతు భరోసా కేంద్ర సిబ్బంది ద్వారా నమోదు చేయబడిన జాబితాను ఆయా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆజాబితాను పరిశీలించి అందులో ఏమైన తప్పులు ఉంటే వెంటనే రైతుభరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు.

15 నుంచి వర్ష సూచన

ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జిల్లాలో అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు వెలువడ్డాయన్నారు. రైతులు గమనించి ఆరబెట్టుకున్న మిరప పంటను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వీరశైవులను ఓబీసీలుగా గుర్తించాలి


నూతన కమిటీ సభ్యులతో మనోహర్

గోనెగండ్ల: వీరశైవులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓబీసీలుగా గుర్తించాలని వీరశైవ సంఘం జాతీయ సలహాదారుడు మనోహర్, రాష్ట్ర కన్వీనర్ అమరేశప్ప, రాష్ట్ర అధ్యక్షుడు దేవేంద్రగౌడ్ కోరారు. బుధవారం స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో వీరశైవ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో వీరశైవులు అర్చకులుగా మారి బతుకు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆర్థికంగా వెనకబడిపోయారని, ఆదుకోవాలని కోరారు. గోనెగండ్లలో వీరశైవులకు శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని,అధికారులు స్పందించి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా శివయ్యస్వామి, రేవయ్యస్వామి, అధ్యక్షుడిగా అమరేష్, ఉపాధ్యక్షుడిగా శిల్పి శ్రీనివాసులు, ఆర్గనైజర్స్ వీరేష్, జగదీష్, రాకేష్, బసవరాజు, కన్వీనర్స్‌గా రాజశేఖర్, సోమేష్, రవి, ఉపేంద్ర, సెక్రటరీలుగా బసవరాజు స్వామి, నాగేష్‌ను ఎన్నుకున్నారు.